క్లుప్తంగా

అనాథాశ్రమంకు కూరగాయలు అందజేత



కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని కోసూరువారిపాలెం వాస్తవ్యుడు సనకా ప్రశాంత్, యక్కటి రామాంజనేయులు సారథ్యంలో సేకరించిన కూరగాయలను బుధవారం ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ పారడైజ్ అనాథాశ్రమ పాఠశాలకు అందజేశారు. కూరగాయలు అందించిన గ్రామస్తులతోపాటు సేకరించిన గ్రామీణ యువజన వికాస సమితి సభ్యులను యువనాయకుడు మండలి వెంకట్రామ్ అభినందించారు. కోసూరు శివనాగమల్లేశ్వరావు, పంచకర్ల నరేంద్ర, అరజా కిరణ్‌కాంత్, నూతక్కి శివబాబు, రేపల్లె పిచ్చేశ్వరావు, పూషడపు రత్నగోపాల్, బాదర్ల లోలాక్షుడు, సైనకా వెంకట రాసేష్‌బాబు, కోసూరు రామకృష్ణారావు, కోసూరు ధనుంజయరావు, యక్కటి కృషార్జునరావు పాల్గొన్నారు.

65మందికి కంటిపరీక్షలు



కొక్కిలిగడ్డ(మోపిదేవి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవడానికి పట్టణ ప్రాంతాలకు రావడానికి వెనుకడుగు వేస్తున్నారని, అందుకే గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు కంటి వైద్యనిపుణులు డాక్టర్ పి.కిషోర్‌బాబు అన్నారు. మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసర్పంచ్ దిడ్ల జానకీరాంబాబు ఆధ్వర్యంలో బుధవారం రేపల్లెకు చెందిన సాయి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్యనిపుణుడు డాక్టర్ పి.కిషోర్‌బాబు పాల్గొని 65మందికి వైద్యపరీక్షలు చేశారు. అవసరమైనవారికి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మండల కోఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, వైద్యసిబ్బంది ఎస్.రాజేష్, నాగలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోడూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వీరాంజనేయప్రసాద్



కోడూరు: మండల ఇన్‌చార్జీ తహసీల్దార్‌గా నాగాయలంక తహసీల్దార్ సిహెచ్.వీరాంజనేయప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శ్రీనునాయక్‌ను ఇటీవల పెదపారపూడికి బదిలీకావడంతో వీరాంజనేయప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయనకు డీటీ సౌజన్య కిరణ్మయి, సీనియర్ అసిస్టెంట్ సరళ, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వోలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వీరాంజనేయ ప్రసాద్ వీఆర్వోలతో మాట్లాడి మండలంలో రెవెన్యూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

డీఎస్సీ పరీక్షకు 137 మంది హాజరు



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో బుధవారం డీఎస్సీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి రాజారమేష్, అడ్మిన్ పి. అశోక్‌కుమార్ తెలిపారు. పరీక్షకు మొత్తం 137మంది హాజరుకాగా, 41మంది గైర్హాజరైనట్లు వివరించారు.

దెబ్బతింటున్న పంట పొలాలు



పెడన: మండల పరిధిలోని మడక గ్రామంలో పెట్రోల్ బంకు నిర్మాణం కోసం తవ్విన గోతుల్లోని వర్షపు నీటిని పంటపొలాల్లోకి వదులుతుండటంతో పైర్లు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్రోలు బంకు యాజమాన్యం ఆయా గోతుల్లోని వర్షపునీటిని పొలాల్లోకి వదలడంతో వెదసాగు వేసిన పైరు దెబ్బతింటోందని రైతులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే పెట్రోలు బంకు యాజమాన్యానికి తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోవడంలేదన్నారు. అధికారులు తక్షణం స్పందించి తగున్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

పంట కాలువలు ఇలా..

నీరు ముందుకు సాగేదెలా?

- తూడు, గుర్రపుడెక్కతో పంట కాలువలు...
- పట్టించుకోని నీటిసంఘాలు
- చోద్యంచూస్తున్న అధికారులు
- ఆందోళనలో శివారు భూముల రైతులు



తూడు, గుర్రపుడెక్కలతో నిండి ఉన్న సర్‌ప్లస్ చానల్



ఆముదాలపల్లి కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన తూడు



తూడు, పిచ్చితీగతో కుంచించుకుపోయిన రామన్నమోడి కాలువ

బంటుమిల్లి: మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండగా, శివారు భూములకు సాగునీరు అందడంపై రైతులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. పంట కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, చెత్తచెదారం పేరుకుపోవడమే రైతుల ఆందోళనకు ప్రధాన కారణం.

అధ్వానంగా పంటకాలువలు..

ఈనెల 15వ తేదీన బంటుమిల్లి ప్రధాన కాలువకు సాగునీరు విడుదల చేయగా, బ్రాంచి కాలువలకు దశలవారీగా నీటిని విడుదల చేశారు. అయితే పంటకాలువలు అధ్వానంగా ఉండటంతోపాటు పదిరోజులుగా పూర్తిస్థాయిలో కాలువలకు నీరు విడుదల చేయకపోవడంతో వదిలిన నీరు శివారుకు చేరుతుందా? అన్న సందేహం రైతుల్లో నెలకొంది. పంట కాలువలు తూడు, గుర్రపుడెక్క, చెత్త, చెదారాలు, జమ్ములతో నిండి ఉన్నాయి. సర్‌ప్లస్ చానల్‌లో లక్ష్మీనారాయణపురం గ్రామం వద్ద బంటుమిల్లి–గుడివాడ రోడ్డు వంతెన వద్ద ఉన్న షట్టర్లకు పెద్దఎత్తున తూడు పట్టుకుని నిలిచిపోయి ఉంది. ఈ కాలువ ద్వారా ఆర్‌వి మోడి, చోరంపూడి బ్రాంచి కాలువల ద్వారా వందలాది ఎకరాలకు నీటి సరఫరా జరగాల్సి ఉంది. కాలువల్లో పేరుకుపోయిన చెత్త కారణంగా సాగునీరు శివారుకు చేరే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

అన్ని కాలువల దుస్థితి అదే..

బంటుమిల్లి ప్రధాన కాలువకు అనుబంధంగా ఉన్న మొండికోడు(సర్‌ప్లస్ చానల్), ముంజులూరు, ఆముదాలపల్లి, కొర్లపాడు తదితర బ్రాంచి కాలువలు అన్ని తూడు, గుర్రపుడెక్కలతో నిండి ఉన్నాయి.

కూలీలతో తూడు, గుర్రపుడెక్క, తొలగిస్తే సాగునీరు శివారుకు చేరి రైతులకు మేలు చేకూరుతుంది. లేనిపక్షంలో పంటలకు నీరు అందక రైతులు ఇబ్బందులు తప్పేలా లేవు. అధికారులు వెంటనే స్పందించి బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలోని బ్రాంచి కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క, జమ్ము తదితర అడ్డంకులు కూలీలతో తొలగించి శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కలెక్టరుకు అర్జీ ఇచ్చాం...



వర్షాలకు ముందే పంట కాలువలు, డ్రెయిన్లు మరమ్మతులు చేయించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాము. పదిరోజులైనా కూడా స్థానిక అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు నేటి వరకు స్పందించలేదు. వర్షాలు పడుతున్న క్రమంలో తూడు, గుర్రపుడెక్కపై కెమికల్ స్ప్రే చేయడం ప్రజాధనం వృధా అవుతుందే తప్పా..ఏమి ఉపయోగం ఉండదు.

– గౌరిశెట్టి నాగేశ్వరరావు, రైతు సంఘ కార్యదర్శి, కృష్ణాజిల్లా

వేసవిలోనే తొలగింపు ఆదేశాలిచ్చాం..

నీటి విడుదలకు ముందే వేసవిలో కాలువలు శుభ్రం చేయించాలని నీటిసంఘాల అధ్యక్షులకు ఆదేశాలు ఇచ్చాం. కొంతమంది చేశారు మరికొందరు చేయలేదు. కాలువలకు నీరు విడుదల జరిగినందున తూడు, గుర్రపుడెక్కపై కెమికల్ స్ప్రే చేయించి తర్వాత కూలీలతో చెత్త తొలగిస్తాం. రైతులు ఇబ్బందులు పడకుండా కాలువ నీరు శివారుకు చేరేలా అన్ని చర్యలు తీసుకుంటాం.

– రాజ్యలక్ష్మి, ఇన్‌చార్జి ఇరిగేషన్ ఏఈఈ, బంటుమిల్లి సెక్షన్

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



మణిమేశ్వరంలో రైతులకు అవహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త నవీన్



పెనుమల్లిలో రైతులతో మాట్లాడుతున్న పెడన వ్యవసాయాధికారిణి జెన్నీ

బంటుమిల్లి: మండలంలోని మణిమేశ్వరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త డాక్టరు బి.నవీన్ మాట్లాడుతూ సార్వా సాగులో అనుకూలమైన విత్తనాలతోపాటు వెదపద్ధతిలో కలుపు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. నారుమళ్ల పెంపకంలో మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పెడన మండలంలో..

పెడన: రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలతో అధిక దిగుబడులు సాధించేదిశగా అడుగులు వేయాలని పెడన వ్యవసాయాధికారి ఎస్.జెన్నీ సూచించారు. మండలంలోని పెనుమల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్నినిర్వహించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పొలాలను పరిశీలించారు. అనంతరం రైతుసేవా కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వ్యవసాయాధికారి జెన్నీ మాట్లాడుతూ రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు ఎల్లప్పుడూ తాము అందుబాటులో ఉంటామని వివరించారు. పంట పొలాల సంరక్షణకు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఎస్ శిరీష, వీఆర్వో సీహెచ్ శ్రీనివాసమూర్తి, రైతులు పాల్గొన్నారు.

మోపిదేవి మండలంలో...

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని కోసూరువారిపాలెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన యువనాయకుడు మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించడంతో పాటు వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వివరించారు.

ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం అమలు..

కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తోందని మండలి వెంకట్రామ్ పేర్కొన్నారు. కోసూరువారిపాలెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఎస్టీ విద్యార్థులకు తల్లికి వందనం నగదు లబ్ధి చేకూరేలా సహకరించిన పాఠశాల హెచ్ఎం తుంగల చంద్రశేఖర్‌ను బుధవారం ఆయన అభినందించారు. ఆ నలుగురు విద్యార్థులు యూనిఫాం కుట్టించుకునేందుకు యక్కటి కృష్ణార్జునరావు రూ.2500లను వెంకట్రామ్ చేతుల మీదుగా అందజేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, బీజేపీ మండల అధ్యక్షులు సనకా ప్రశాంత్, కోసూరు ఆనంద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



మండలి పవిత్ర



పులిగడ్డ అలేఖ్య

తలగడదీవి(నాగాయలంక): మండలంలోని తలగడదీవి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థినులు మండలి పవిత్ర, పులిగడ్డ అలేఖ్య ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఇన్‌చార్జి హెచ్ఎం బండ్రెడ్డి శివరామప్రసాద్ బుధవారం తెలిపారు. సీటు సాధించిన బాలికలను గ్రామ సర్పంచ్ భోగాది వెంకటేశ్వరరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వర్రే రాంబాబు, ఎస్ఎంసి చైర్మన్ ఎ.మోహన్‌లాల్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అటుకులతో శ్రీరామలింగేశ్వరునికి అభిషేకం



నాగాయలంక: మహాశివుడి జన్మనక్షత్రం(ఆర్ద్ర) పురస్కరించుకుని నాగాయలంక కృష్ణానది తీరంలోని శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ వద్ద శ్రీరామలింగేశ్వర మండపంలో బుధవారం రాత్రి 150 కేజీల అటుకులతో అభిషేకం చేశారు.అభిషేకంలో భక్తులు సైతం అటుకులు తీసుకొచ్చి స్వామివారికి స్వయంగా అభిషేకించ వచ్చునని పేర్కొనడంతో భారీసంఖ్యలో భక్తులు అటుకులతో స్వామివారికి అభిషేకం చేశారు. అర్చకుడు అంబా సాయికిరణ్‌శర్మ బ్రహ్మత్వంలో అటుకులతో జరిపిన అభిషేకం, అలంకారం శోభాయమానంగా సాగింది. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహణకర్త తలశిల రఘుశేఖర్, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీవో రద్దుకు డిమాండ్




పెడన: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్లకు సంబంధించి జీవో నంబరు 5ను తక్షణం సవరణ చేసి రేషనలైజేషన్‌ను రద్దు చేయాలని సర్వేయర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామ సచివాలయ సర్వేయర్లు బుధవారం సాయంత్రం ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామ సర్వేయర్ ఉద్యోగులను సొంత మండలాలకు కాకుండా ఇతర మండలాలకు బదిలీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పట్టణాల్లో సొంత వార్డు మినహా, ఇతరవార్డులకు కేటాయించినవిధంగానే సొంతగ్రామాన్ని మినహాయించి ఇతర గ్రామాల్లో బదిలీలకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈనెల 26వ తేదీ గురువారం నగరంలోని ఆయాప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.గోవిందరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. నగరంలోని చల్లరాస్తా సెంటర్, చమ్మనగిరిపేట, బలరామునిపేట ప్రాంతాల్లో ఉదయం 7గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి



డ్రోన్ ద్వారా గుర్తించిన పేకాట శిబిరం

ఘంటసాల: మండలంలోని లంకపల్లి నుంచి పూషడం వెళ్లే డొంక రోడ్డులో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. పోలీసులు డ్రోన్ కెమెరాల ద్వారా లంకపల్లి నుంచి పూషడం వెళ్లే డొంక రోడ్డులో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాన్ని గుర్తించి దాడిచేశారు. పందేలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులతోపాటు 9బైక్‌లు, రెండు కోడి పుంజులు, రెండు కత్తులు, రూ.2200 నగదు స్వాధీనం చేశారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

అధికార పార్టీ అయితే అనుమతి అక్కర్లేదా?



పెడన పట్టణం 11వవార్డు బంటుమిల్లి రోడ్డులో జాతీయ రహదారిని ఆనుకుని అధికార పార్టీకి చెందిన ఓవ్యక్తి మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా భారీ భవనాన్ని నిర్మిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ భవనం పక్కనే ఎమ్మెల్యే ఫొటోతో కూడిన ఫ్లెక్సీని సైతం ఏర్పాటు చేయడం ద్వారా తమను ఎవరు అడ్డుకుంటారో చూస్తానన్నట్లుగా వ్యవహరిస్తుండటం చూసి 'అధికార పార్టీ అయితే అనుమతులు అక్కర్లేనట్లేనా? అని స్థానికులు గుసగుసలాడుకుంటుండటం గమనార్హం.

– పెడన

బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ చేయూత



బాధితురాలికి సరుకులు అందజేస్తున్న ఆర్ఐ కృష్ణమోహన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

చల్లపల్లి: అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ చల్లపల్లి సబ్‌బ్రాంచ్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు, సామగ్రి, టార్పాలిన్ అందజేశారు. మండల పరిధిలోని వెలివోలు దళితవాడలో ఈనెల 24వ తేదీన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొడాలి ఝాన్సీకి చెందిన పూరిగుడిసె దగ్ధమైంది. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ చల్లపల్లి సబ్ బ్రాంచ్ ఛైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, వైస్ చైర్మన్ పేరం మధుసూదనరెడ్డి, కోశాధికారి ఎండిఎకె జిలానీ కలిసి బాధిత కుటుంబానికి ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్ చేతులమీదుగా బుధవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఆకురాతి హరిప్రసాద్, బళ్ల మధుసూదనరావు, కె.సాల్మన్, కుంపటి బాబూరావు పాల్గొన్నారు.

నేటినుంచి వారాహి మహోత్సవాలు

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెంలో కృష్ణానది ఒడ్డున వేంచేసియున్న శ్రీదుర్గా కోటేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం నుంచి వారాహి గుప్త నవరాత్రుల మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు రామిశెట్టి నాగరాణి, రామకృష్ణ దంపతులు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమాలు జూలై 4వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం 7.30గంటలకు కుంకుమార్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

శ్రీరామ పాదక్షేత్రం వద్ద..

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం దేవాలయాల సముదాయంలోని శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో గురువారం నుంచి శ్రీవారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్(బుజ్జి) బుధవారం తెలిపారు. కనకదుర్గమ్మ ఆలయం ముఖ మండపంలో వారాహి అమ్మవారి విగ్రహం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ప్రతిరోజూ రాత్రి వేళలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. తొమ్మిది రోజులపాటు సాగే ఉత్సవాల్లో ఉభయదాతలుగా పీటలపై కూర్చొనేందుకు ఆసక్తిగల భక్తులు సెల్‌నంబరు 8897079990లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఓఎన్‌జీసీ అధికారుల తీరుపై రైతుల గగ్గోలు!



ఓఎన్‌జీసీ అధికారులు అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులు

కృత్తివెన్ను: ఇంతకంటే మంచి రోడ్డు వేస్తాం...మాపై నమ్మకం లేదా ఇదిగో హామీపత్రాలు ఇచ్చి కూడా ఓఎన్‌జీసీ అధికారులు రోడ్డు వేయలేదంటూ రైతులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే..కృత్తివెన్ను మండలం కొమాళ్లపూడి నుండి సంగమూడి వరకు సుమారు 1.4కిలోమీటర్లు మేర పంటకాలువ గట్టు వెంబడి ఓఎన్‌జీసీ పైపులైను వేయడానికి భూమి అవసరమైంది. దీంతో సంబంధిత ఓఎన్‌జీసీ అధికారులు, గ్రామస్తులను సంప్రదించి పరిహారంగా నగదు చెల్లిస్తామని చెప్పారు. అయితే తమకు డబ్బులు వద్దని, పైపులైన్ వేసేక్రమంలో కాల్వగట్టు దెబ్బతింటున్నందున ఆస్థానంలో పటిష్టమైన రోడ్డు వేయాలని కోరారు. ఇందుకు అంగీకరించిన సంబంధిత అధికారులు పైపులైన్ పనులు మొదలుపెట్టినప్పటికీ రోడ్డు నిర్మాణం మాత్రం చేపట్టలేదు.దీంతో గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం చెబుతూ పనులు నిలిపివేశారు. ఈక్రమంలో సంబంధితశాఖలోని డిప్యూటీ కలెక్టర్ వచ్చి రోడ్డు నిర్మాణానికి స్థానికుల సమక్షంలో ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులతో లిఖితపూర్వక హామీ ఇప్పించారు. అనంతరం కొంతమేర తూతూమంత్రంగా రోడ్డు పనులు మొదలుపెట్టి, పైపులైన్ పనులు పూర్తికాగానే రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వదిలేశారని స్థానిక రైతులు వాపోతున్నారు. ఓఎన్‌జీసీ అధికారుల తీరు కారణంగా దాదాపు 200 ఎకరాల్లోని ఆక్వా ఉత్పత్తులు, వాటికి కావాల్సిన మేత రవాణాకు నానాకష్టాలు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. గతంలో నాణ్యంగా ఉన్న రోడ్డును పైపులైన్ కోసం పూర్తిగా ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఓఎన్‌జీసీ అధికారులు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని, లేనిపక్షంలో సంబంధిత కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

మత్తుపదార్థాలతో అనేక అనర్థాలు : సీఐ



మాట్లాడుతున్న చల్లపల్లి సీఐ ఈశ్వరరావు

ఘంటసాల: యువత మాదక ద్రవాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చల్లపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఈశ్వరరావు సూచించారు. ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో బుధవారం ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన 'గంజాయి–దుష్ప్రభావం, పోక్సో చట్టం'పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం అనేక అనర్థాలకు దారితీస్తుందన్నారు. విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలన్నారు. మత్తుకు అలవాటుపడితే మెదడు పని చేయడం మానేస్తుందని, జీవితం దుర్భరంగా మారుతుందని హెచ్చరించారు. ఎస్ఐ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మీ ఫోన్, బ్యాంకు అకౌంట్లలోని నగదు దోచుకునేందుకు ఏఏ మార్గాల్లో ప్రయత్నాలు చేస్తారో అవగాహన కల్పించారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీ, పాస్‌వర్డులను ఇతరులకు చెప్పవద్దని, తెలియని ఫోన్ నెంబర్ల నుంచి వచ్చే లింక్స్, ఫైల్స్ ఓపెన్ చేయొద్దని సూచించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు పనుల ప్రారంభం



గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

పెడన: మండలంలోని దావోజీపాలెం గ్రామంలో పరకోడు మురుగు డ్రయిన్‌లో రెండు కిలోమీటర్ల మేర చేపట్టిన కిక్కిస, జమ్ము, గుర్రపు డెక్క తొలగింపు పనులను బుధవారం పెడన జెడ్పీటీసీ అర్జావెంకటనగేష్ ప్రారంభించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ఈ డ్రెయిన్‌కు ఇరువైపులా వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉండటంతో, సాగునీటి పారుదలకు ఇబ్బందిగా ఉన్న గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, కార్యదర్శి శీరం ప్రసాద్, ఉపసర్పంచ్ కాగిత లక్ష్మీనాగేశ్వరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లపై జరిమానా

మోపిదేవి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లపై జరిమానా విధించినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. ఒక్కొక్క ఇసుక ట్రాక్టర్‌పై రూ.2,500 జరిమానా విధించినట్లు వివరించారు. మండలంలోని కె. కొత్తపాలెం కృష్ణాకరకట్టపై మంగళవారం పోలీసులు ఈ ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని రెవెన్యూ కార్యాలయంలో అప్పగించగా, ఈమేరకు జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు .